# తిండి దొంగ

"తిండిదొంగలంటే జ్ఞాపకం వచ్చింది. మొన్న మా అత్తగారేంచేసిందను కున్నారు? ఎవరితోనూ చెప్పకుండా పెద్దగిన్నెలో అన్నమూ, కూరలూ, పిండి వంటలూ అవీ పెట్టుకొని కొడుకుదగ్గిరికి వెళ్లిపోయింది." అన్నాడు డాక్టరు శ్రీహరి రావు క్లబ్బులో.

అందరూ ఆశ్చర్యపడ్డారు.

*　　　*　　　*　　　*

వెంకాయమ్మ అన్నవస్త్రాలకు లోటులేని ఇంటనే పుట్టినా ఒక్కరోజు కూడా మనశ్శాంతి ఎరుగదు. తన తండ్రి, పెత్తండ్రి నిత్యమూ కుక్కలల్లే కాట్లాడుకునే వాళ్లు. తన తల్లీ, ఆవిడ వియ్యపురాలూ అస్తమానమూ సాధించుకుంటూ సూటీ పోటీ మాటలాడుకునేవాళ్లు. ఇల్లు పంచుకున్నా, దొడ్డి పంచుకుని బావి నడిమయానికి దడి కట్టు కున్నా కూడా ఈ పోట్లాటలు తప్పలేదు. ఇద్దరికీ కావలసిన ముసలమ్మ ఉండేది. ఒకరి మాటలు ఒకరికి వినపడక తప్పదాయె. బంధువులు—ఉభయపక్షాలకూ అయిన వాళ్లు—రాకుండా ఉండరాయె. ఇవన్నీ పోట్లాటలు పెరగటానికి ఉపకరించాయిగాని సమాధానం కుదరటానికి తోడ్పడ్డ పాపాన పోలేదు. దొడ్డి దడినుంచి ఏ వైపువాళ్లు నాలుక గీసుకోటానికింత తాటాకుముక్క లాగినా, రెండోవేపు వాళ్ళకి శివమెత్తు కొచ్చేది. ఆఖరుకు, బావిలోనుంచి ఎవరు ఎక్కువ నీళ్లు చేదుకుంటున్నారనే దాన్ని గురించి కూడా పోట్లాడుకునేవాళ్లు. పిల్లలకు కూడా పరస్పరం ద్వేషం కలిగేటట్టు చేశారు పెద్దవాళ్లు. పెద్దవాళ్ళ కావేషాలకన్నా ఈ ద్వేషాలే ఎక్కువ హానికరంగా ఉండేవి. ఎందుకంటే పెద్దవాళ్ళ కావేషాలకు ఏదో ఒక ఆధారం - కుంటిదో, గుడ్డిదో ఉండేది. చిన్నవాళ్ళ ద్వేషాలకు ఏ ఆధారమూ లేదు. అది మానవ ప్రకృతిమీది ద్వేషంగా పరిణమించక తప్పదు; మానవత్వాన్ని నాశనం చెయ్యకా తప్పదు.

వెంకాయమ్మకు పెళ్ళయి ఆమె కాపరానికి వెళ్ళిన తరవాత కొద్దికాలం పాటు జీవితం శాంతివంతంగా ఉన్నట్టు కనిపించింది. గాని, అది రాజకీయవేత్తలు చెప్పినటు స్మశానశాంతి. వెంకాయమ్మ మామగారు చాలా ఏళ్ళక్రితమే పోయినాడు. ఆ ఇంటి ఆవరణలో ఆమె అత్తగారిదే రాజ్యం. ఆవిడతో ఎవరూ వాదించటానికి లేదు. ఎదురుమాట అనటానికి లేదు. ఆవిడకు ఎవరిమీదనా ఆగ్రహం వస్తే ఆ పూట వాళ్ళు తిండి తినరాదు. ఆవిడ ఏ కోడలినన్నా పిలిచి, "వంద బిందెలు

తోడు," అంటే తోడవలసిందే. ఎక్కడా పొయ్యటానికి లేకపోతే పారబోయాలి సిందేగాని తోడటం మానరాదు. ఆవిడ ఏ కొడుకునన్నా పిలిచి, "నీ పెళ్ళాన్ని పది దెబ్బలు కొట్టు" అంటే వాడు కొట్టాలిసిందే, చావాలిసిందే. "ఎందుకు ?", "ఏం చేసింది ?" అనటానికి వీల్లేదు.

మొదట్లో వెంకాయమ్మ తన కళ్ళనూ, చెవులనూ నమ్మలేకపోయింది. ఇదంతా ఒక ఆటలాగా, అందులో తనకేమీ భాగం లేనట్టూ, తాను మాత్రం ప్రేక్షకురాలైనట్టూ భావించింది—తనను అత్తగారు నూరు బిందెలు తోడమని, తోడ లేనని చేతుల దెబ్బలు ఊరుకున్నందుకు తన భర్తచేత పది దెబ్బలు కొట్టించటం జరిగినాక ఈ భావన పోయింది

యథార్థమైనంత మాత్రంచేత ప్రతిదీ సహజం కానవసరంలేదు. తన అత్తగారి ప్రవర్తనా, మిగిలినవాళ్ళు ఆవిడ "పైత్యాన్ని" సహించి శిరసావహించ టమూ వెంకాయమ్మకు అమిత అసహజంగా తోచింది. చదువుకున్న మగాళ్ళు కూడా యీ పిచ్చిముండ మాటలు ఎందుకు వింటారూ ? వాళ్ళకి యావజ్జీవ ఖైదెం దుకు ? తల్లి అని భక్తా ? లేక ఆవిడపేర ఆస్తి ఉందని గౌరవమా ?

ఆ తరంవాళ్ళలో వెంకాయమ్మ బాగా తెలివి గలదనే చెప్పాలి. ఎంత కీచులాడుకున్నా తన పుట్టింటివాళ్ళు మెట్టినింటివాళ్ళకన్న చాలా నాగరికులని వెంకాయమ్మ సులభంగానే గ్రహించింది. తన అత్తగారు కొంత కాలానికి చచ్చిపోయింది. ఇకనైనా పరిస్థితులు మారతాయనుకున్నది. పరి స్థితులు మారాయిగాని వెంకాయమ్మ మొగుడు మానవత్వం సంపాదించ లేదు. మానవత్వం తాలూకు బీజాలు అతనిలో ఏనాడో తల్లి పుణ్యాన నాశనమై పోయాయి. తల్లి ఆత్మకు శాంతి కలగగలందులకు వెంకాయమ్మను అతను రోజూ కారణం లేకుండానే చావగొట్టేవాడు. అదివరలో మొగుడు అత్తగారి చేతిలో పని ముట్టల్లే కనిపించడంవల్ల ఆమెకెప్పుడూ అతనిమీద అట్టే కోపం రాలేదు. ఇప్పుడు కోపమూ, అసహ్యమూ కూడా కలిగాయి. ఈ దశలోనే, ఇద్దరు పిల్లల తల్లి అయి వుండి వెంకాయమ్మ గాడితప్పి, ప్రేమంటే ఎట్లా ఉంటుందో ఇతరత్రా తెలుసు కున్నది. కాని ఈ రహస్యప్రణయం కొద్దికాలమే సాగి వెంకాయమ్మ ప్రతిష్ఠ పాడు కాకుండా అంతమయింది. ఇది ఆమెకు మానసికంగా చాలా మేలు చేసింది. సరిగా ఆ సమయానికి ఎవరో ఒకరు ఆమె హృదయంలో ప్రేమ రగల్చకపోతే ఆమె హృదయం శాశ్వతంగా శుష్కించిపోయి ఉండును. ఈ అనుభవం ఫలితంగా ఆమెకు తన కొడుకుమీద కూతురిమీద అనురాగం హెచ్చింది; జీవితంమీదా కొంత ఆశ కూడా కలిగింది.

.... .... ....

వెంకాయమ్మ మొగుడు కష్టజీవి కాడు.

ఎవరో పొలాలు పండించి కుమ్మరి స్తే దానితో కాలక్షేపం చేసినవాడు. అయినప్పటికీ అతను పట్టణ వాసాలలోని కష్టజీవుల మాదిరిగానే జీవితాన్ని మరచిపోవటానికి తాగుడు అలవాటు చేసుకున్నాడు. అంతులేని కష్టం పాఠకుల మనస్సులను ఎట్లా సంక్షోభింప చేస్తుందో, లోతులేని అజ్ఞానం అతని మనస్సును అదేవిధంగా క్షోభింపజేసి పలాయనం కోరింది. ఆటే శ్రమ లేకుండా డబ్బు సంపాదించటానికి అతను చేసిన ప్రయత్నాలు ఏమీ ఫలించలేదు. పైపెచ్చు వున్నది కూడా ఊడ్చి పెట్టుకుపోయింది. తల్లి ఆ పేమో ఆడపిల్లలకు పోయింది. ఆవిడ ఆడించినట్టు ఆడిన కొడుకు కోడళ్ళకూ, వాళ్ళ పిల్లలకూ పూచికపుల్ల దక్కలేదు.

* * * *

వెంకాయమ్మ మొగుడు పోయేనాటికి ఆమె కొడుకు రమణయ్య పన్నెండేండ్లవాడు, కూతురు సుభద్ర ఎనిమిదేళ్ళది. తను జన్మ ఎత్తిన ముప్పై ఏళ్ళకు వెంకాయమ్మకు మొగుడు పోగానే మనశ్శాంతి లభించినట్టు కనిపించింది. ఇప్పుడు తనను ఇతరుల మూలంగా ఏ బాధాలేదు. పిల్లలిద్దరూ బుద్ధిమంతులు. ఇద్దరూ చదువుకుంటున్నారు. ఏడెనిమిదెకరాల పొలం వున్నది. రైతు మంచివాడు. కాని ఈ ఉన్న కాస్త మనశ్శాంతినీ, బాధ్యతలు హరించాయి. చుట్టపక్కాలతో ముఖ్యంగా మొగుడివైపు వాళ్ళతో, అకారణమైన పేచీలు రాకుండా, మళ్ళీ వాళ్ళు తనను మోసం చేయకుండా చూచుకోవాలి. ఇంటిపనులు చాలా భాగం రమణయ్య చేస్తాడు. కాని పైవాళ్ళ సహాయం లేకుండా జరగదు. తన మర్యాదకు భంగం రాకుండా మంచి మాటలతో ఇరుగు పొరుగు వాళ్ళచేత పనులు చేయించుకోవాలి. పిల్లలకు కాస్త దగ్గూ పడిసెమూ వస్తే తనకు భగవంతుడు తప్ప మరో దిక్కులేదనిపించేది. వెంకాయమ్మకు తనకే ఏదన్నా జబ్బుచేస్తే "నేను పోతానేమో? ఈ పిల్లలేమౌతారు? వాళ్ళ మొహం ఎవరు చూస్తారు?" అనిపించేది.

కాని ఈ విధమైన బాధ్యతలు వెంకాయమ్మను నిజంగా బాధించలేదు. పైనుంచి పోరు లేకుండా ఉంటే స్వతంత్రంగా ఎంత బాధ్యత అయినా భరించవచ్చు. ఇది ప్రత్యేక వ్యక్తులకూ, ప్రజలకూ కూడా వర్తిస్తుంది.

అంతమాత్రానికి మనిషికి మించిన బాధ్యతలుండవని కాదు. సుభద్ర పెళ్ళి ఒకటి వెంకాయమ్మను చాలా బాధించసాగింది. తను న్యాయంగా కోరదగిన కోర్కెలనే అణుచుకునే స్వభావంగల వెంకాయమ్మ కూతురి పెళ్ళి విషయంలో ఎన్నో గొంతెమ్మ కోరికలు కోరసాగింది. సుభద్రకు వచ్చే మొగుడు అందరికీ నచ్చాలి. అందగాడుగా, చదువుకున్నవాడుగా, బుద్ధిమంతుడుగా, డబ్బున్నవాడుగా వుండాలి; సుభద్ర అత్తవారు మంచివారై ఉండాలి; వాళ్ళు పెద్ద కట్నాలడగరాదు; పెళ్ళికి ఏమీ ఖర్చు కారాదు.

ఈ ఆఖరు కోరిక తప్ప మిగిలినవన్నీ కలిసివచ్చిన సంబంధం వచ్చింది. వాళ్ళు సుభద్రను చూసి చేసుకుంటామన్నారు. వాళ్ళంతట వాళ్ళు కట్నం యింత ఇమ్మని అడగలేదుగాని, అవతల మూడువేలు కట్నమిస్తామంటూ సంబంధాలున్నాయి. కట్నాలకిందనే మూడువేలు పోసి, పెళ్లి ఖర్చుల కింకొక వెయ్యి పోసి—రమణయ్య అడుక్కుతినాలిసిందే

సుభద్ర పెళ్లికి రమణయ్య బొత్తిగా బొట్టికాయ కాడు; పదిహేనోయేడు వచ్చింది. స్కూలుఫైనలు చదువుతున్నాడు. వెంకాయమ్మ కొడుకును సలహా అడిగింది. "ఖర్చయితే అయిందిలే, మంచి సంబంధం చేద్దాం. మగవాణ్ణి బతకలేక పోతానా?" అన్నాడు. వెంకాయమ్మ సంబంధం స్థిరం చేసింది. పెళ్లివారు వెయ్యిం నూటపదహార్లు రొక్కమూ, మిగిలిన లాంఛనాల క్రిందా, వచ్చినవారి బట్టలకిందా మరో వెయ్యి తీసుకోవటానికి అంగీకరించారు.

ఈ పెళ్ళి నిశ్చయించి వెంకాయమ్మ బంధువుల విమర్శకు గురి అయింది. ముఖ్యంగా ఆమె మొగుడివైపు వాళ్ళు, "మా వంశానికి చెందిన పొలం కాస్తా లోకులపాలు చేస్తున్నావు—మా తాత ముత్తాతలు అనుభవించిన ఆస్తి!" అన్నారు. వెంకాయమ్మకు అభిమానం వచ్చింది. సుభద్ర పెళ్ళికి అవసరమైన మూడువేలూ పొలం తాకట్టు పెట్టి రూపాయి వడ్డీకి సంపాదించింది. పొలంమీద వచ్చేదానితో ఏనాటికైనా అసలు ఫాయిదాలు చెల్లుబడవా, రమణయ్య సంపాదించడా! అని ఆమె ధైర్యం. ఏమైనాసరే పొలంలో ఒక్క సెంటు కూడా అమ్మరాదని ఆమె ప్రతిజ్ఞ.

* * * *

ఈ ప్రతిజ్ఞ చెల్లలేదు. రమణయ్య మేజరు కాగానే నాలుగెకరాలు అమ్మి వడ్డీతోసహా ఈ బాకీ తీర్చేశాడు. అప్పుడే అతని భార్య కూడా కాపరానికి వచ్చేసింది. అతనికి ఉద్యోగం మాత్రం నిలకడగా దొరకలేదు. నెలకు పాతిక రూపాయలు సంపాదించటానికి నానా హైరానా పడాల్సి వచ్చింది.

అతని దరిద్రం కవులు కీర్తించేది. చిత్రకారులు చిత్రించేది కాదు. అది ఆకర్షరహితమై, గాయం కలగనీకుండా తగిలిన దెబ్బలాటిది. రెండేళ్ళ కొకరు చొప్పున పిల్లలు పుట్టుకు రాసాగారు. ఖర్చు జాస్తి అయింది. దానికి తగ్గ ఆర్జన లేదు. ఇంట్లో సరిగా తిండి, గుడ్డా లేవు.

మొదట్లో వెంకాయమ్మ ఈ దరిద్రాన్ని లక్ష్యపెట్టలేదు. రమణయ్యను కోడల్ని చూస్తుంటే వెంకాయమ్మ కేదో గొప్ప సంతృప్తి కలిగేది. ఈ తరం వాళ్ళు జీవితాన్ని మార్చేశారు. రమణయ్య భార్య జానకి తన కాలం నాటి కోడలు కాదు. తనను రమణయ్య ఎట్లా చూసేవాడో, జానకి అట్లాగే చూసేది. రమణయ్య కూడా తన కాలంనాటి భర్త కాదు. జానకిని బిడియం లేకుండా అపేక్షతో చూసే

వాడు. "నీవు అడదానివి. నిన్ను మనిషల్లే చూడవలసిన అవసరంలేదు" అన్నట్టు ఎప్పుడూ పెళ్ళాంతో మాట్లాడేవాడు కాడు.

"ఇంకా కొంతకాలానికైనా మొగుళ్ళంతా పెళ్ళాలను ఇట్లాగే చూస్తారు కాబోలు. ఎంత మంచిరోజులు!" అనుకునేది వెంకాయమ్మ. ఏ మనిషిలోగాని అటువంటి ఆశ కలిగించే శక్తులు తప్పక అభ్యుదయ శక్తులే.

కాని ప్రత్యక్ష దారిద్ర్యం ఇటువంటి సంతృప్తిని ఎంతోకాలం దక్క నివ్వదు. ఒక్కొక్క ఏడే, ఒక్కొక్క నెలే, ఒక్కొక్క వారమే, ఒక్కొక్క రోజే యుగంగా గడవసాగింది.

దారిద్ర్యం మనుషుల మంచితనాన్ని మన్నించదు. వాటిని మన్నించే మాన వులు దారిద్ర్యాన్ని నాశనం చెయ్యటానికి పూనుకోవాలి. మంచితనం మీదా, సంస్కారం మీదా అభిమానం ఉన్నవాళ్ళు దారిద్ర్యం పట్ల ఉపేక్ష వహిస్తే దారిద్ర్యం మంచితనాన్నీ సంస్కారాన్నీ నాశనం చేసి తీరుతుంది.

* * * *

"మాతో ఎందుకమ్మా నువు కూడా ఈ కష్టాలు పడటం? నువు సుభద్ర దగ్గిరికి పోయి ఉండు. శ్రీహరిరావు పని బాగుంది. అతని వైద్యం బాగా సాగు తున్నది. నెలనెలా వెయ్యి, పదిహేనువందలూ బ్యాంకులో వేస్తున్నాట్ట" అని రమణయ్య తల్లిని ప్రయాణం చేయించాడు.

వెంకాయమ్మ కూతురు దగ్గిరికి వచ్చింది. చాలా సేపు నీటిలో మునిగి వుండి ఉక్కిరి బిక్కిరి అవుతూన్న మనిషి బయటికి వచ్చినట్టయింది. ఇక్కడ దరిద్రం లేదు. లక్ష్మి తాండవమాడుతున్నది. సుభద్ర పూర్వజన్మ సుకృతం—ఏ పెట్టె తీసినా పదిరూపాయల నోట్లే. ఇనప్పెట్టిలో వెయ్యిరూపాయలకు తక్కువ ఏనాడూ ఉండవు. బీదవాళ్ళల్లే కనిపించేవాళ్లు కూడా డాక్టరు దర్శనం చేసుకుని, ఆయనచేత కసిరించుకుని అయిదురూపాయల నోట్లూ, పదిరూపాయల నోట్లు చేతిలో పెట్టి పోతుంటారు. రోజూ ఇట్లాగే సాగుతుంది. రేపు పదిరూపాయలనోటు రాదేమో అనే భయం లేదు—రాకపోతే ఇబ్బంది లేదు.

సుభద్ర వంటినిండా బంగారు తొడుగు.

సుభద్ర కూతురికి ఉన్నాయి—వెయ్యి రూపాయల నగలూ, బొమ్మలూ, తోపుడుబళ్ళూ, వెండిగిన్నెలూ, బంగారు గిన్నెలూనూ.

ఒక వారంపాటు వెంకాయమ్మకు తన కొడుకు జీవితం జ్ఞాపకమే రాలేదు. కాని ఈ ఇంట్లో తనకున్న స్థానం నౌకర్లకున్నటువంటిదేనని వెంకాయమ్మకు త్వరలోనే తెలిసిపోయింది. ఇంటికి వచ్చే గొప్పవాళ్ళతో తాను మాట్లాడరాదు.

ఇంట్లో పనివాళ్ళకు తను పనులు చెప్పరాదు. మొగుడూ, పెళ్ళామూ ఎక్కడికి బయలుదేరినా తనను పిలవరు. సుభద్ర తనతో మాట్లాడేటప్పుడు నౌకర్లతో మాట్లాడిన దానికన్న కూడా అసహ్యంగా మాట్లాడుతుంది. నౌకర్లు కోపం వస్తే పని మానేసి పోవచ్చు....ఎవరో సుభద్రను అడిగారు, "ఆవిడ మీ అత్తగారాండీ?" అని....

ఈ ఇంట్లో జరిగే వృధా ఖర్చు చూసి, కొడుకు పడుతున్న పాట్లు జ్ఞాపకం వచ్చి, వెంకాయమ్మకు కన్నీటి పర్యంతం ఐంది. ఈ దుబారా ఖర్చులో సగం ఉంటే—నాలుగోవంతుంటే—రమణయ్య జీవితం హాయిగా వెళ్ళిపోను!....ఎందుకీ వ్యత్యాసం? ఎవరు చెబుతారు? ఎట్లా అర్థమవుతుంది?

నోరు కట్టుకోలేక వెంకాయమ్మ ఒకనాడు కూతుర్ని అడిగింది. "నీ దగ్గర ఎప్పుడన్నా కాస్త డబ్బు మిగిల్తే అన్నయ్యకు పంపించరాదుటే?" అని.

"నా కటువంటి పనులు అసహ్యం. మా ఆయనకు తెలియకుండా నే నొక్క కానీ ఖర్చు చేయను. అన్నయ్యకు కావలిస్తే ఆయన్నడుగరాదు, నా మోషియా?" అన్నది సుభద్ర. సుభద్ర హృదయంలేని మనిషి కాదు. కూతురిమీద ఎంతో ఆపేక్ష, డబ్బుకు దారిద్ర్యంమీద గల నిర్లక్ష్యమే సుభద్రలో కనిపిస్తున్నది.

* * * *

ఆరోజు డాక్టరు శ్రీహరిరావు ఇంట్లో విందు. సుభద్ర పుట్టినరోజు. ఎంతెంత గొప్పవాళ్ళో వస్తున్నారు. పెద్దెత్తున వంట సాగుతున్నది. మణుగులకొద్దీ కూరలు, గుండిగలతో అన్నం.

ఆరోజే వచ్చింది రమణయ్య దగ్గర్నుంచి ఉత్తరం. "....జానకి మూడు రోజులనుంచీ మంచం పట్టింది. డాక్టర్లకు చూపమంటారు. దేనికి? తినడానికి తిండి లేక మాడే మనిషికి మందు లెందుకు? ఇవాళో రేపో అందరమూ మంచం ఎక్కడానికి సిద్ధంగానే ఉన్నాం...."

ఎంత కష్టమైనా ప్రత్యక్షంగా భరించటం కన్న పరోక్షంగా సహించటం చాలా కష్టం. ఈ ఉత్తరం చూడగానే వెంకాయమ్మ కాళ్ళుచేతులూ వణికి శరీరం చల్లబడ్డట్టయింది. ఇటువంటి పరిస్థితులు అదివరలో వెంకాయమ్మ చూస్తుండగా చాలాసార్లు జరిగాయి. ఈ ఉత్తరం రాసిన మరో గంటకు రమణయ్య ఎవరి దగ్గరయినా రెండు రూపాయలు బదులు పుచ్చుకొని ఉండవచ్చు. కాని ఆ విషయం వెంకాయమ్మకు ఎట్లా తట్టుతుంది?

ఆమె ఉత్తరం పట్టుకుని సుభద్ర దగ్గిరికి పోయి, "అన్నయ్య ఉత్తరం రాశాడే" అన్నది.

భూభారమంతా మోస్తున్నంత విసుగుతో సుభద్ర, "ఇప్పుడేమిటమ్మా? తర వాత సావకాశంగా చూడకూడదూ?" అంటూ అర్జంటు పనిమీద వెళ్ళిపోయింది.

ఆ రాత్రి భోజనాదులయాయి, విస్తళ్ళలో ఎవరి చిత్తం వచ్చినంత వారు పారేశారు. కొడుకు దగ్గిర్నుంచి ఉత్తరం వచ్చిన తరవాత వెంకాయమ్మ గుక్కెడు మంచినీళ్ళు తాగలేదు. అందరు భోజనాలూ అయి పనివాళ్ళు వెళ్ళిపోయేసరికి రాత్రి పదకొండయింది. వెంకాయమ్మ ఇంకా భోంచెయ్యలేదు. భోంచేశావా అని అడిగిన వారు లేరు.

వెంకాయమ్మ వంటఇంటిలోకి పోయింది. ఇంకో సమారాధనకు సరిపోయే పదార్థాలు మిగిలిపోయాయి. ఒక అరిటాకు వేసుకుని పప్పెడన్నం పెట్టుకొని భోజనానికి కూచుంది. ముద్ద దిగలేదు "ఏపాటు తప్పినా సాపాటు తప్పదు" అంటూ బలవంతాన రెండు ముద్దలు మింగిందో లేదో వాంతి అయిపోయింది.

వెంకాయమ్మకు ఏదో గొప్ప ఆలోచన తట్టింది. ఒక పెద్ద గిన్నె తీసి దాని నిండా అన్నమూ, కూరలూ, పిండివంటలూ, పచ్చళ్ళూ కుక్కిపెట్టింది. దాని పైన ఆకు కప్పి వాసెన కట్టింది.

అది పట్టుకుని అర్ధరాత్రివేళ బయలుదేరింది—కొడుకు ఇంటికి!

ముద్రణ: ఆంధ్రజ్యోతి మాసపత్రిక, సెప్టెంబరు, 1949.